www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,70306545

సంపుటి - 2 సంచిక -208 గురువారం 10 అక్టోబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## సమాజానికి సమర్థులైన
# పౌరులను అందించండి

వారిని తీర్చి దిద్దే బాధ్యత టీచర్లుగా మీపైనే ఉంది

సమాజంలో బడులే కీలక భూమిక పోషించాలి

ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగు పర్చేలా చర్యలు

కొరివి దయ్యాన్ని నమ్ముకోవడం వల్లనే ఉద్యోగాలు రాలే

డిఎస్సీ నియామక పత్రాల అందచేతలో సిఎం రేవంత్





హైదరాబాద్,అక్టోబర్ 09/ప్రజావినికిడి: సమర్థులైన పౌరులను తీర్చిదిద్దే బాధ్యత కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న టీచర్లపైనే ఉందని, పాఠశాలలు అందుకు వేదిక కావాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మీకు వచ్చిన ఈ బాధ్యతను సమర్థంగా ఉపయోగించి సమాజానికి మంచి పౌరులను అందించాలన్నారు. కెసిఆర్ ఇంట్లో ఉద్యోగాలు ఊడగొట్టడం వల్లనే ఇవాళ తెలంగాణలో కొలువుల జాతర సాగుతోందన్నారు. డీఎస్సీ విజేతలను చూస్తే దసరా పండుగ ముందే వచ్చినట్లు అనిపిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

మిగతా 2లో.



## హామీలకు పైసలు లేకున్నా
# మూసీ ముచ్చటేందో

ఎన్నికల హామీలను ఎగ్గొట్టిన కాంగ్రెస్

రేవంత్ సర్కార్‌పై కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్,అక్టోబర్ 09/ప్రజావినికిడి: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు పైసలు లేవంట.. కానీ మూసీ ప్రక్షాళన కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తాడంట.. అని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ సీనియర్ లీడర్ మహమ్మద్ అలావుద్దీన్ పటేల్ సహా ఆయన అనుచరులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ జాబ్ పొగొట్టండి. మీకు ఏడాది లో 2 లక్షల ఉద్యోగాలంటూ రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి ఇది నా గ్యారంటీ అని హామీ ఇచ్చాడు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి తప్ప తెలంగాణ యువతకు ఉద్యోగాలు రాలేదని కేటీఆర్ తెలిపారు. మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నాడు. కోటి 60 లక్షల మంది మహిళలు రూ. 2500ల కోసం వేచి చూస్తున్నారు. వృద్ధులకు రూ. 4 వేలు అన్నాడు. ఇంట్లో ఇద్దరికీ పింఛన్ అన్నాడు.

మిగతాది 2లో...

# గ్రూప్-1 మెయిన్స్ షెడ్యూల్ విడుదల

21 నుంచి 27 వరకు మెయిన్ పరీక్షలు

మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు నిర్వహణ




హైదరాబాద్,అక్టోబర్ 09/ప్రజావినికిడి: :తెలంగాణలో 'గ్రూప్-1' మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. అక్టోబరు 21 నుంచి 27వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించ నున్నారు. ఆయాతేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగ నున్నాయి. అయితే మధ్యాహ్నం 12:30 నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం1.30 తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను అక్టోబరు 14 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌లో పొందుపరిచిన అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. జూన్ 9న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఎగ్జామ్‌కు మొత్తం 3.02 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు.


మిగతాది 2లో...

# ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు యదాతథం

రెపోరేటు తగ్గింపునకు ఆర్‌బిఐ విముఖం

విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే నిర్ణయాలు

వివరాలు వెల్లడించిన గవర్నర్ శక్తికాంత్ దాస్



హైదరాబాద్,అక్టోబర్ 09/ప్రజావినికిడి: విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ బుధవారం ప్రకటించారు. రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి కేంద్ర బ్యాంకు ఈ రేటును ఇలాగే కొనసాగిస్తూ వస్తోంది. ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది పదోసారి. 2024-25లో వాస్తవ జీడీపీ వృద్ధిరేటు అంచనా 7.2 శాతం. రెండో త్రైమాసికంలో 7 శాతం, మూడు, నాలుగో త్రైమాసికంలో 7.4శాతంగా ఉండే అవకాశం. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్‌లో 7.3శాతంగా వృద్ధి రేటు అంచనా వేసింది.

మిగతాది 2లో...

## ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆందోళన

ఇందిరాపార్క్ వద్ద మందకృష్ణను అడ్డుకున్న పోలీసులు



హైదరాబాద్,అక్టోబర్ 09/ప్రజావినికిడి: డిఎస్సీలో ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఆందోళన చేపట్టింది. ఈ క్రమంలో నగరంలో ఆందోళనకు దిగిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాల పోస్టులను భర్తీ చేయడాన్ని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ నుంచి మాదిగల నిరసన ప్రదర్శన చేపట్టారు.

మిగతాది 2లో...

# 2028 వరకూ ఉచిత బియ్యం

హైదరాబాద్,అక్టోబర్ 09/ప్రజావినికిడి: పండగల సీజన్‌లో నరేంద్రమోడీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2028 డిసెంబర్ వరకు ఉచిత బియ్యం పంపిణీ పథకాలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దేశ వ్యాప్తంగా ఆహార భద్రతలో భాగంగా ఉచితంగా బియ్యం/ఆహార ధాన్యాలను అందించేందుకు ఉద్దేశించిన పీఎం కల్యాణ్ అన్నయోజన (పీఎంజీకెఎవై)ను మరో నాలుగేళ్లు పొడిగిస్తున్నామని , ఇందువల్ల ప్రభుత్వానికి రూ.17,052 కోట్ల ఖర్చు అవుతుందని తెలియజేసింది. ఈ మొత్తం కేంద్రమే భరిస్తుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం నాడు మీడియాకు వెల్లడించారు. ఫోర్టిఫైడ్ రైస్ నాణ్యతను పరీక్షించేందుకు 27 ఎన్‌ఏబీఎల్ ల్యాబ్స్‌ను వినియోగిస్తామని , విటమిన్ మినరల్ ప్రీమిక్స్ టెస్టింగ్ కోసం 11 ఎన్‌ఏబీఎల్ ల్యాబ్‌లు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఇందుకు అవసరమైన సప్లై



చైన్ డెవలప్‌మెంట్ కోసం రూ. 11,000 కోట్లు ఇన్వెస్ట్ చేస్తామని మంత్రి తెలిపారు.

ఇదిలా ఉండగా గుజరాత్ లోని లోథాల్‌లో నేషనల్ హెరిటేజ్ కాంప్లెక్స్ అభివృద్ధికి కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు చెప్పారు. ఇందువల్ల 22 వేల ఉద్యోగాల సృష్టి జరుగుతుందన్నారు. వివిధ దశల్లో ఈ ఎన్ఎం హెచ్‌సీని అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాజస్థాన్, పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో 2280 కిలో మీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి సైతం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు అశ్విని వైష్ణవ్ తెలిపారు. దీనికి రూ. 4406 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. ఎన్‌ఎంహెచ్‌సి ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి నిర్ణయించారు. దీనివల్ల ప్రత్యక్షంగా 15000, పరోక్షంగా 7000 ఉద్యోగాలు లభిస్తాయి. లైట్‌హౌస్ మ్యూజియం నిర్మాణానికి కూడా ఆమోదించారు. దీని మొదటి దశ నిర్మాణం 2025 నాటికి పూర్తవుతుంది.

# రతన్ టాటా కన్నుమూత

: ప్రధాని మోడీ సహా ప్రముఖుల దిగ్భ్రాంతి



# ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

దీంతో ఈ నిరసనను పోలీసుల అడ్డుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో పాటు, పలువురు ఎమ్మార్పీఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఇందిరాపార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ నేతలు, పోలీసులకు మధ్య వాగ్వివాదం తోపులాట ఉద్రిక్తతకు దారి తీసింది. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ నుంచి లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించ తలపెట్టిన మాదిగల నిరసన ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. అరెస్ట్ చేసిన ఆందోళనకారులను నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి మాదిగలకు డీఎస్సీ ద్వారా వచ్చే ఉద్యోగాలను కల్పించిన తర్వాతే నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ముందుగానే నియామక పత్రాలు అందజేయడం వల్ల మాదిగలు అన్యాయానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా చేపట్టే ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు పాటించాలంటూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలను, కార్యకర్తలు ఉద్యమ కారులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయలేదా అని ప్రశ్నించారు. అలాగే ర్యాలీలు నిర్వహిస్తున్న వారిని అడ్డుకొని అరెస్ట్ చేయడం దారుణమంటూ మందకృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండానే ఉద్యోగాల భర్తీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసిందని.. మాదిగలను నట్టేట ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగల పట్ల ఎనలేని ప్రేమ ఉన్నట్లు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆచరించడం లేదని.. మాలల పక్షాన నిలుస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి మాలలకు కొమ్ము కాస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పీసీసీ చీఫ్‌గా మాదిగలకు తక్కువ సీట్లు ఇచ్చి.. మాలలకు ఎక్కువ టికెట్లు ఇచ్చారని మండిపడ్డారు. శాసనసభ ఎన్నికల్లో మాదిగలకు నాలుగు సీట్లు తగ్గడానికి కారణం రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణను తొలుత దేశంలో అమలు చేసే రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని చెప్పారని గుర్తుచేశారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన అర్ధ గంటకే రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన ఉద్యోగాలకు కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పారని తెలిపారు. అయితే రెండు నెలలు కాకముందే రేవంత్ రెడ్డి మాదిగలకు వెన్నుపోటు పొడిచారని మందకృష్ణ విరుచుకుపడ్డారు.

# ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు యదాతథం

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన వర్షపాతం నమోదు, సరిపడా నిల్వలతో ఈ ఏడాది చివరికి ఆహార ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉంది. సెప్టెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం భారీగా పెరగొచ్చని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.5శాతంగా ఉండే అవకాశం ఉంది. తయారీ ఖర్చులు తగ్గడం, ప్రభుత్వ విధానాలు, దేశీయంగా పెరుగుతున్న డిమాండ్ తదితర కారణాలతో తయారీ రంగం వృద్ధి చెందుతోంది. ఆర్థిక రంగం స్థిరంగా ఉంది. బ్యాంకుల కార్యకలాపాలు బలంగా ఉన్నాయి. యూపీఐ లైట్ వాలెట్ పరిమితి రూ.2000 నుంచి రూ.5వేలకు పెంపు దేశంలోని సామాన్య ప్రజలకు ఈసారి కూడా ఉపశమనం లేదు. ఇఓఎల పెనుభారం తగ్గలేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , తన పాలసీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. యథాతథంగా, 6.50 శాతం వద్ద కొనసాగించింది. గత ఏడాది ఫిబ్రవరి నుంచి రిజర్వ్ బ్యాంక్ తన రెపో రేటును అలాగే కొనసాగిస్తూ వస్తోంది. రెపో రేట్‌లో ఎలాంటి మార్పు చేయకుండా, యథతథంగా కొనసాగించడం వరుసగా ఇది పదో సారి. 2024లో ఇది వరుసగా ఐదోసారి. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. మానిటరీ పాలసీ కమిటీలోని ఆరుగురు సభ్యుల్లో ఐదుగురు రెపో రేటు తగ్గింపును వ్యతిరేకించారు. దేశంలో రెపో రేటును తగ్గించకూడదంటూ ఐదుగురు సభ్యులు ఓటు వేసినట్లు ఆర్బీఐ గవర్నర్ వెల్లడించారు. ఈ ఏడాది జులై, ఆగస్టు నెలల్లో రిటైల్ ద్రవ్యోల్బణం, 4 శాతం కంటే తక్కువగానే ఉన్నప్పటికీ, రెపో రేటులో కేంద్ర బ్యాంక్ ఎటువంటి మార్పు చేయలేదు. రెపో రేట్‌లో మార్పు ఉండదని మార్కెట్ ముందు నుంచీ ఊహిస్తోంది కాబట్టి, ఇదేమీ ఆశ్చర్యకరమైన నిర్ణయం కాదు.ç÷పో రేట్ మారదని ముందు నుంచి సిద్ధమైన మార్కెట్, ఆర్‌బీఐ గవర్నర్ ప్రసంగంపై మాత్రం నిశితంగా దృష్టి పెట్టింది. భవిష్యత్ కార్యాచరణ గురించి ఆయన ఏం చెబుతారన్నది ఇటు సామాన్య ప్రజలకు, అటు కార్పొరేట్లకు చాలా కీలకం. దేశ ఆర్థిక వ్యవస్థకు మార్గనిర్దేశర చేసే వ్యాఖ్యలు గవర్నర్ ప్రసంగంలో ఉంటాయి కాబట్టి, ఆయన మాటలను అర్థం చేసుకోవడం ముఖ్యం. ద్రవ్యోల్బణానికి ప్రపంచ ఉద్రిక్తతలు అతి పెద్ద ముప్పుగా పరిణమించాయని అన్నారు. లోహాలు, ఆహార పదార్థాల ధరల్లో ఇటీవలి పెరుగుదల కారణంగా రిటైల్ ద్రవ్యోల్బణం ప్రమాదంలో ఉంది. 2024 జులై, ఆగస్టు నెలల్లో ప్రధాన ద్రవ్యోల్బణం పెరిగిందని, బేస్ ఎఫెక్ట్ కారణంగా చిల్లర ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశంలో చిల్లర ద్రవ్యోల్బణం సగటున 4.5 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ గవర్నర్ అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో (జులై-సెప్టెంబర్) ద్రవ్యోల్బణం 4.1 శాతంగా, మూడో త్రైమాసికంలో (అక్టోబర్-డిసెంబర్) 4.8 శాతం, నాలుగో త్రైమాసికంలో (జనవరి-మార్చి) 4.2 శాతం ఉండొచ్చని చెప్పారు. దేశంలో ద్రవ్యోల్బణం రేటును అదుపులో ఉంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇన్‌ఫ్లేషన్ అదుపులో ఉన్నట్లు కనిపించినప్పటికీ, ఆహార ద్రవ్యోల్బణం మాత్రం ఇప్పటికీ లక్ష్యానికి మించి ఉంది. అంటే, దేశంలో ఆహార పదార్థాల ధరలు అదుపులో లేవు. అందుకే, రెపో రేటును 6.50 శాతంగా కొనసాగించాలని కేంద్ర బ్యాంక్ నిర్ణయించింది. రెపో రేట్ తగ్గితే, బ్యాంక్ రుణాలపై వడ్డీ రేట్లు కూడా తగ్గుతాయి. రెపో రేట్ తగ్గించక పోవడంతో, కోట్లాది మంది రుణగ్రహీతలు, బ్యాంకు ఖాతాదార్లు నిరాశకు గురయ్యారు. వడ్డీ రేట్లు తగ్గితే లోన్ తీసుకుందామని ఎదురు చూస్తున్నవారికి కూడా ఇది నిరాశ కలిగించేదిగా ఉంది. పండుగ సందర్భంగా ఆర్‌బీఐ నుంచి మంచి నిర్ణయం వినొచ్చని ఎదురు చూస్తున్న ప్రజలంతా నిరుత్సాహపడ్డారు.

# సమాజానికి సమర్థులైన పౌరులను అందించండి

(మొదటి పేజీ తరువాయి)

డిఎస్సీ నియాక పత్రాల అందచేతలో సిఎం రేవంత్ టీచర్లే తెలంగాణ వారధులు.. నిర్మాతలని, పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందని తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలను సిఎం రేవంత్ స్వయంగా అందజేసారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ కొత్త టీచర్లకు కీలక సూచనలు చేశారు. తెలంగాణలో 30వేల పాఠశాలలు ఉంటే.. 24లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు యాజమాన్యంలో 10 వేల పాఠశాలలు ఉంటే 34లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటులో మీకంటే ఎక్కువ చదువుకున్నవారు, మీకన్నా గొప్ప వ్యక్తులు, అనుభవం ఉన్నవారు బోధిస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ బడికి వెళ్లడమంటేనే గ్రామాల్లో సైతం నామోషీగా భావిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి పోయిన వారు కూడా తాము తిన్నా తినకపోయినా, పుస్తెలు అమ్మి అయినా తమ పిల్లలను ప్రైవేటు బడి, కాన్వెంట్‌కు పంపాలనుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలకు పంపాలంటే.. ఎందుకు ఇబ్బందిపడుతున్నారో ఆలోచించండి. మీకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించే బాధ్యత నేను తీసుకుంటా.. కానీ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మీరు కృషిచేయండని సూచించారు. నిరుపేదలు బంగారం అమ్మి ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపే పరిస్థితి మారాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలన్నారు. తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారిని భవిష్యత్తులో డాక్టర్లుగా, లాయర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీదే. నేను ప్రభుత్వ బడిలో చదువుకున్నా.. సీఎం అయ్యాను. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేశవరావు, కోదండరాం వంటి ఎందరో ప్రభుత్వ బడిలోనే చదివారు. కార్పొరేట్ బడిలో చదువుకోలేదు. మీలాంటి టీచర్లు చెప్పిన చదువుతోనే ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దిన క్షేత్రం ప్రభుత్వ బడి. స్కూళ్లలో అన్ని



వసతులూ కల్పించేందుకు కృషిచేస్తున్నాం. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభిస్తున్నాం. ఈ నెల 11న ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శ్రీకారం చుడుతున్నాం. విద్యకు బ్జడెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించాం. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరిస్తున్నాం అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం నిరుద్యోగులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. రెండుసార్లు కోరి కొఱివి దెయ్యాన్ని తెచ్చుకున్నట్లుగా బీఆర్‌ఎస్‌కు అధికారం ఇచ్చాం. ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగాలు భర్తీ అవుతాయని అందరూ ఆశించినా.. తెలంగాణ వచ్చిన మూడేళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్లకు నియామక పక్రియ పూర్తి చేశారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు తీర్చలేదు. యువతకు ఉద్యోగాలు రావాలంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఉద్యోగాలు ఊడాలని గతంలో చెప్పాను. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని నిరుద్యోగులు బాధ్యత తీసుకున్నారు. 90 రోజుల్లో 30వేల కొలువులు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశాం. 65 రోజుల్లో డీఎస్సీ నియామక పక్రియ పూర్తి చేశాం అని వివరించారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వ బడుల పాత్ర కీలకం. డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవాలని కొరివి దెయ్యాలు యత్నించాయి. కేసులు వేసి డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవడానికి కుట్రలు చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భవిష్యత్తు తరాలకు టీచర్లు ఆదర్శంగా మారబోతున్నారు. డీఎస్సీ విజేతల సంతోషాన్ని చూసి కొందరు కళ్లల్లో కారం పెట్టుకొంటారు. ఎంపీగా కవిత ఓడిపోగానే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కుమార్తెకు మాత్రం 6 నెలల్లో ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల మేలు కోసం విశ్రాంతి తీసుకోకుండా శ్రమిస్తున్నాం. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలి. తెలంగాణ సమాజంపై బీఆర్‌ఎస్‌కు ఎందుకంత కోపం? ఏడు లోక్‌సభ స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు డిపాజిట్లు పోయాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు మాకు అధికారం ఇచ్చారు. మా ప్రభుత్వాన్ని పడగొడతామని బీఆర్‌ఎస్ అంటోంది.. ఇది న్యాయమా? బీఆర్‌ఎస్‌కు అధికారం రాదు.. తెలంగాణ ప్రజలు ఇవ్వరని మరోమారు స్పష్టం చేశారు. విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలను పెంపొందిస్తాం. రాష్ట్రంలో ఏటా 1.10లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నారు. నైపుణ్యాలు పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ప్రారభించాం. స్కిల్ వర్సిటీ ద్వారా సాంకేతిక నైపుణ్యం అందిస్తున్నాం. ఒలింపిక్స్ వేదికల్లో దేశం పరిస్థితి ఏంటో చూశాం. నాలుగు కోట్లు జనాభా ఉన్న దక్షిణ కొరియాకు ఒలింపిక్స్‌లో 32 పతకాలు వస్తే.. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు ఆ తరహాలో ఒలింపిక్స్‌లో ఎందుకు పతకాలు రాలేదు? తెలంగాణ యువత మత్తుకు బానిసలయ్యారు. వ్యసనాలకు బానిసలై.. యువత తప్పుదోవ పడుతున్నారు. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అ÷-లథెట్లకు బంగారు పతకాలు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, సిఎస్ శాంతికుమారి, ఆచార్య కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలకు పైసలు లేకున్నా మూసీ ముచ్చటేందో

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కరికన్నా వచ్చిందా? అంటే లేనే లేదు. ఉన్న రైతు బంధు, ఉన్న పింఛన్ కూడా వస్తలేదు.వాళు 420 హామీలు ఇచ్చారు. ఇప్పుడు ఏమైనయ్ అంటే సమాధానం చెబుతలేదు. కళ్యాణ లక్ష్మి పేరుతో తులం బంగారం ఇస్తా అన్నాడు. తులం ఇనుము కూడా ఇవ్వడని కేటీఆర్ విమర్శించారు. సంక్షేమ పథకాల కోసం పైసలు ఇస్తే మీరు కమిషన్‌లు ఇవ్వరు కదా? అదే మూసీ ప్రాజెక్ట్ అయితే లక్షా కోట్లు మింగొచ్చు. రాహుల్ గాంధీ, వాళ్ల బావకు కోట్ల రూపాయలు దోచి పెట్టొచ్చు. మనం గల్లా పట్టి అడిగే వరకు ఈ కాంగ్రెస్ పార్టీ మోసం కొనసాగుతూనే ఉంటది. మనం ఏదైనా సమస్య వస్తే కలెక్టర్లకు చెప్పాలంట. ఇంటింటికి ఓట్ల కోసం వచ్చిన వాళ్లను మాత్రం అడగవద్దంట. ప్రజలకు ఏం ఖర్మ. ఎవరైతే మనకు తప్పుడు హామీలు ఇచ్చారో వాళ్లనే పట్టుకోవాలే. కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులను పట్టుకొని మనం అడగాలె అని కేటీఆర్ సూచించారు.

# గ్రూప్-1 మెయిన్స్ షెడ్యూల్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఈ పరీక్ష ఫలితాలను జులై 7న విడుదల చేశారు. ఇందులో 31,382 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హత సాధించారు. వీరికి అక్టోబరు 21 నుంచి మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. గ్రూప్-1 మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లు ఉంటాయి. ప్రతీ పేపర్‌ను 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 3 గంటలు. మెయిన్ పరీక్షలను ప్రతీ రోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలో జనరల్ ఇంగ్లిష్ తప్ప మిగిలిన పేపర్లను అభ్యర్థులు ఎంచుకున్న భాషల్లో రాయాలి. గ్రూప్-1 మెయిన్స్ లో మొత్తం 06 పేపర్లు ఉంటాయి. వీటిని అభ్యర్థి ముందుగా ఎంచుకున్న మాధ్యమంలోనే రాయాల్సి ఉంటుంది. పేపర్‌లో కొంత భాగాన్ని ఇతర భాషలో రాయడానికి అభ్యర్థికి అనుమతి లేదు.

# ఎస్సీ వర్గీకరణ నివేదిక వచ్చాకే నోటిఫికేషన్లు

**60 రోజుల్లో ఏకసభ్య కమిషన్ నివేదిక**

**బీసీ సామాజిక , ఆర్థిక, కుల సర్వే పూర్తిచేయాలి**

**కమిషన్ల భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్,అక్టోబర్ 09/ప్రజావినికిడి:

సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ కులాల వర్గీకరణ అమలుకు నియమించిన ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని, ఆ తర్వాతే ఉద్యోగ నియామకాలకు సంబంధించి కొత్త నోటిఫికేషన్లు వేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు.ఎస్సీ వర్గీకరణ అమలు, బీసీ సామాజిక, ఆర్థిక కుల సర్వే తదితర అంశాలపై సచివాలయంలో బుధవారం ఆయన సమీక్షించారు. ఎస్సీ వర్గీకరణపై తమకు అందిన వినతులు, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో వర్గీకరణ అమలవుతున్న తీరు, హర్యానాలో చేపట్టిన చర్యలను మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి సీఎంకు వివరించారు. న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవకుండా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాభా లెకలను పరిగణనలోకి తీసుకొని, ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు నిర్దేశించారు. కమిషన్‌కు అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాల నుంచి అందేలా చూడాలని సీఎస్‌కు సూచించారు. మంత్రివర్గ ఉప సంఘానికి అందిన వినతులపైనా సమావేశంలో చర్చించడంతోపాటు, వాటన్నింటినీ ఏకసభ్య కమిషన్‌కు అందించాలని నిర్ణయించారు.క్షేత్రస్థాయి నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదుల స్వీకరణకు ఉమ్మడి పది జిల్లాల్లో ఒకోరోజు పర్యటించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. తెలంగాణలో బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని చెప్పారు. సర్వేకు అవసరమైన యంత్రాం గం తమ వద్ద లేదని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలుపగా, రాష్ట్ర ప్రణాళిక విభాగాన్ని కేటాయిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. బీసీ కమిషన్, ప్రణాళిక విభాగానికి సమన్వయకర్తగా ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని సీఎస్ శాంతికుమారికి ఆదేశాలు జారీచేశారు. 60 రోజుల్లోనే సామాజిక, ఆర్థిక సర్వే పూర్తి చేసి, డిసెంబర్ 9లోగా నివేదిక సమర్పించాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లొచ్చని సీఎం తెలిపారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వీ శేషాద్రి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, న్యాయశాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి, ముఖ్యమంత్రి కార్యదర్శులు మాణిక్‌రాజ్, షానవాజ్ ఖాసీం, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

# రతన్ టాటా కన్నుమూత

**: ప్రధాని మోడీ సహా ప్రముఖుల దిగ్భ్రాంతి**




హైదరాబాద్,అక్టోబర్ 09/ప్రజావినికిడి:

ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా (86) కన్నుమూశారు. ముంబైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య చికిత్స తీసుకుంటున్న ఆయన బుధవారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచారు.వృద్ధాప్య సమస్యల కారణంగా గత కొంత కాలంగా ఆయన వైద్య చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆయన ఈ లోకాన్ని వీడి వెళ్లిపోయారు.కాగా, 1937 డిసెంబర్ 28న నావల్ టాటా - సోనీ టాటా దంపతులకు రతన్ టాటా జన్మించారు. 1991 సంవత్సరంలో రతన్ టాటా టాటా గ్రూప్ చైర్మన్ అయ్యారు. ఆ తర్వాత ఆయన వెనుదిరిగి చూడలేదు. 10 వేల కోట్లుగా ఉన్న టాటా పారిశ్రామిక సామ్రాజ్యాన్ని లక్ష కోట్లకు తీసుకెళ్లడంలో ఆయన కృషి ఎంతో ఉంది. భారతదేశంలో అత్యంత గౌరవనీయమైన పారిశ్రామికవేత్తలలో రతన్ టాటా ఒకరు. ఆయన నాయకత్వంలో టాటా గ్రూప్ అనేక ముఖ్యమైన విజయాలను సాధించింది. రతన్ టాటాకు 2000లో పద్మభూషణ్, 2008లో పద్మవిభూషణ్, దేశం రెండవ అత్యున్నత పౌర పురస్కారాలు లభించాయి.

## కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు అందజేత



ప్రజావినికిడి,(అంబర్ పేట్): 102 మందికి 1,00116/- రూపాయల చొప్పున 1 కోటి 2 లక్షల 11 వేల రూపాయల కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్, బాగ్ అంబర్ పెట్ కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి,నల్లకుంట కార్పోరేటర్ అమృతతో కలిసిఅలీ కేఫ్ లోని ఎస్.ఆర్.జి ఫంక్షన్ హాల్ లో 102 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.కుటుంబ సభ్యుడిగా తమ ఇంట్లో ఆడపిల్ల పెళ్ళికి అండగా నిలిచినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అంబర్ పెట్ ఎమ్మార్వో వీరాభాయ్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ బిక్షపతి, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు,బిఆర్ఎస్ పార్టీ అంబర్పేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జాఫర్, లింగారావు,జగత్ సింగ్,అబ్దుల్ నయీం, అజార్,సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
దేవి నవరాతుల్లో భాగంగా బుధవారం రోజు హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సుష్మా సాయి నగర్ కాలనీ నందు నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్బీనగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ భారస పార్టీ అభ్యర్థి రాగిడి లక్మారెడ్డి మరియు నాయకులు గుత్తా లక్మారెడ్డి,దీపావళి శ్రవణ్,శ్రీకాంత్,వెంకట్ రెడ్డి,మహేందర్ రెడ్డి,శ్రీనివాస్,సునీల్ మరియు పలువురు నాయకులు,నిర్వాహకులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న

### : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..

### వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు..



ప్రజావినికిడి, (ఎల్బీనగర్):అక్టోబర్ 9:
అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్నా అని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. బైరామల్గూడా లోని శ్రీ శక్తి హనుమాన్ దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మూడవరోజు శనివారం నాడు అమ్మవారు సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేసుధీర్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు గజ్జల మధుసూదన్ రెడ్డి,కర్మన్ఘాట్ జాన్ ఆంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త బండారు శ్రీనివాస్ రెడ్డి, ఆలయ నిర్వాహకులు పండాల శేఖర్ గౌడ్ లతో కలసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరము అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కర్మన్ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ మాజీ ధర్మకర్త బండారి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 1200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ...

### పాల్గొన్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్,రోహిన్ రెడ్డి...



ప్రజావినికిడి,(అంబర్ పేట్): అక్టోబర్ 9:అంబర్ పెట్ నియోజకవర్గం లోని అలీ కేఫ్ చౌరస్తా వద్ద ఉన్న ఎస్.ఆర్.జీ ఫంక్షన్ హాల్ లో కళ్యాణలక్ష్మి చెక్ ల పంపిణి కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ తో పాటు కాంటెస్టెడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రోహిన్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ యాదవ్,శంబుల శ్రీకాంత్ గౌడ్,మాజీ కార్పొరేటర్ పులి జగన్,పి.రామ్మోహన్ రావు,నియోజకవర్గ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండ సురేఖ పై ఆరోపణలు ఎంతవరకు సబబు...

### టీఎఫ్ సిసి స్టేట్ జనరల్ సెక్రటరీ మరియు బిసి సాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి జల్లేపల్లి వెంకటేశ్వరరావు (జేవిఆర్)

**నాగార్జున నువ్వు ఎప్పుడైనా సినీ ఇండస్ట్రీకి మద్దతు తెలిపావా?...**

**సినిమా ఇండస్ట్రీ అయితే మద్దతు తెలుపుతారా...**

**కొండ సురేఖ వి రాజకీయ వ్యాఖ్యలు... వాటితో సినీ ఇండస్ట్రీకి ఏం సంబంధం..**



ప్రజావినికిడి,(హైదరాబాద్):
నిలదీసిన టీఎఫ్ సిసి జనరల్ సెక్రటరీ బిసి సాధికార సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లెపల్లి వెంకటేశ్వరరావు ఇటీవల కేటీఆర్ పై మంత్రి కొండా సురేఖ విమర్శలు చేసిన తరుణంలో నాగచైతన్య మాజీ భార్య సమంత పై చేసిన వ్యాఖ్యలతో అక్కినేని నాగార్జున కుటుంబానికి సంబంధం ఏమిటని తెలంగాణ టీఎఫ్ సిసి స్టేట్ జనరల్ సెక్రటరీ మరియు బిసి సాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి జల్లేపల్లి వెంకటేశ్వరరావు (జేవిఆర్) ప్రశ్నించారు. ఈ సంఘటనకు ముందు కొండా సురేఖపై సోషల్ మీడియాలో వచ్చిన వ్యాఖ్యల మీద పిసిసి కార్యాలయంలో మంత్రి కొండా సురేఖ తన మీద వస్తున్న సోషల్ మీడియా పోస్టులపై మాట్లాడుతూ కన్నీటి పర్యంతమైన అప్పుడు మాట్లాడని వీరంతా, కేటీఆర్ మీద వ్యాఖ్యలు చేస్తే సినీ ఇండస్ట్రీ ఎందుకు గగ్గోలు పెట్టిందని జేవిఆర్ నిలదీశారు. కొండ సురేఖ పై సోషల్ మీడియాలో వచ్చిన ట్రోలింగ్ వెనుక ఉన్నదెవరో కేటీఆర్ కు తెలియదా అని జేవియర్ ప్రశ్నించారు. ట్రోలింగ్ కు పాల్పడింది వి ఆర్ ఎస్ పార్టీకి చెందిన వారన్న విషయం ఆయనకు తెలియదా అని అన్నారు.ట్రోలింగ్ విషయంలో మారు మాట్లాడని కేటీఆర్, సమంత విషయంలో మాత్రం సినీ ఇండస్ట్రీని రెచ్చగొట్టి,కొండా సురేఖ మీద ఉసిగొల్పారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే తెలంగాణలో మంత్రివర్గంలో బీసీలకు ప్రాధాన్యం తగ్గిందని,ఉన్న ఏకైక మహిళ కొండ సురేఖ ను కూడా మంత్రివర్గంలో లేకుండా చేయడానికి కుట్రపన్ని బిఆర్ఎస్ పార్టీ సినీ ఇండస్ట్రీ తో కుమ్మక్కు అయిందని జల్లెపల్లి వెంకటేశ్వరరావు (జేవియర్) ధ్వజమెత్తారు.అదే ఇండస్ట్రీకి చెందిన పవన్ కళ్యాణ్ వ్యక్తిగత విషయాలపై సినీ పరిశ్రమకు చెందిన పోసాని కృష్ణమురళి మరియు అప్పటి రాజకీయ నాయకులు రకరకాలుగా కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తే ఈ సినీ ఇండస్ట్రీ ఎందుకు మూగబోయిందని జల్లేపల్లి వెంకటేశ్వర్ రావు దుయ్యబట్టారు. నాగార్జున ఎప్పుడు కూడా సినీ ఇండస్ట్రీకి మద్దతుగా లేనప్పటికీ, ఆయన వ్యక్తిగత విషయంలో మాత్రం సినీ ఇండస్ట్రీ కి చెందిన హీరోలు పలువురు మద్దతుగా నిలవడం పై జేవిఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తెలంగాణకు చెందిన ఆడపడుచు,బీసీ బిడ్డ అయినందుకు మంత్రి అని కూడా చూడకుండా సినిమా హీరోలు పలువురు కొండా సురేఖ వ్యాఖ్యల ను వక్రీకరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గత ఐదేళ్లుగా ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం సినిమా ఇండస్ట్రీని పట్టించుకోనప్పటికీ ఇదే హీరోలు ఎందుకు నోరు మెదపలేదని జేవిఆర్ నిలదీశారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కేటీఆర్ ను ఉద్దేశించి చేసినవని, సినిమా ఇండస్ట్రీ నీ ఉద్దేశించి చేసిన కాదన్న విషయం సినిమా హీరోలకు తెలియదా అని జల్లేపల్లి అడిగారు.తెలంగాణ రాష్ట్రంలో కోట్లాది రూపాయల కలెక్షన్లను కొల్లగొడుతూ వేల కోట్లకు పరిగెత్తి,కళ్ళ కావరంతో ముఖ్యమైన హెూదాలో ఉన్న తెలంగాణ ఆడపడుచు,మహిళా మంత్రిపై సినీ ఇండస్ట్రీ విరుచుకు పడటం సమంజసమా అని జేవిఆర్ ప్రశ్నించారు. హిందూ సాంప్రదాయాన్ని మంటగలుపుతున్న ఆయన మాజీ కోడలు, కాబోయే కోడలు వేషధారణ పై సాంప్రదాయ వాదులు ఆక్రోషం వెళ్లగక్కుతున్నారని, అలాంటి వారికి సినిమా ఇండస్ట్రీ మద్దతు తెలపడం కరెక్టేనా అని జల్లెపల్లి వెంకటేశ్వరరావు ప్రశ్నించారు.

## బిజెఆర్ నగర్ లో బతుకమ్మ సంబరాలు...

### పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్, మామిడి నర్సింగ్ రావు...





ప్రజావినికిడి, (ఫిల్మ్ నగర్):అక్టోబర్ 9: ఫిలింనగర్ లోని బీజేఆర్ నగర్ లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ బతుకమ్మ వేడుకలకు ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్,ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షులు మామిడి నర్సింగ్ రావు తదితరులు హాజరయ్యారు. మహిళా మండలి సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బిజేఆర్ నగర్ బస్తివాసులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొందుర్గు దుర్గామాత మండపాలలో పూజా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సి నవీన్ రెడ్డి



ప్రజావినికిడికొందుర్గు:
కొందుర్గు మరియు చెక్కలోనిగూడ దుర్గా మాత మండపాలలో పూజ కార్యక్రమలకు హాజరైన,ఎమ్మెల్సి నవీన్ రెడ్డి,ఈ కార్యక్రమం లో కొందుర్గు మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్, మాజీ జడ్పిటిసి తనయుడు రామక్రిష్ణ,కొందుర్గు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, చేగుర్ మాజీ పిఏసిఎస్ చైర్మన్ విట్టల్,మరియు మాజీ వార్డ్ మెంబెర్స్,సింగిల్ విండో డైరెక్టర్స్,గ్రామ కమిటీ అధ్యక్షులు,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## దుర్గమాత నవరాత్రుల్లో పాల్గొన్న కార్పొరేటర్ నాయి కోటి పవన్ కుమార్





ప్రజావినికిడి,కొత్తపేట :నవరాత్రులు సందర్భంగా కొత్తపేట డివిజన్ భరత్ నగర్ ఫేస్ 1, శ్రీనివాస కాలనీ, లక్ష్మి నగర్ కాలనీ, మోహన్ నగర్, నాగేశ్వర్ నగర్, శ్రీ రామలింగేశ్వర కాలనీ నిర్వహించిన దుర్గ మాత పూజ మరియు జాగరణ కార్యక్రమంలో పాల్గొన్న కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ శ్రీ నాయికోటి పవన్ కుమార్ గారు, అనంతరం అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమం పాల్గొని ఆశీర్వాదాలు తీసుకున్నారు.

## కోట మైసమ్మ దేవాలయంలో

## ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్**

**బీజేవైఎం యువ నాయకులు మేకల ఆనంద్ ముదిరాజ్**

**ఏడవ రోజు దర్శనమిచ్చిన సరస్వతి దేవి...**



ప్రజావినికిడి, ( శంషాబాద్): అక్టోబర్ 9,
శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధాంతి కోటమైసమ్మ దేవాలయం శ్రీ దేవిశరన్ నవరాత్రి భాగంగా 7వ రోజు సరస్వతి అమ్మవారి అవతారం దర్శమిచ్చిన అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ స్వీకరించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ సిద్ధాంతి కోటమైసమ్మ దేవాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారిని దర్శించుకున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ సిద్ధాంతిలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ కోట మైసమ్మ దేవాలయంలో ఏడవ రోజు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ప్రత్యేక పూజ అనంతరం బుక్క వేణుగోపాల్ కి వేద పండితులు తీర్థ ప్రసాదములు అందజేశారు.అలాగే బీజేవైఎం యువ నాయకులు మేకల ఆనంద్ ముదిరాజ్ శాలువాతో ఘనంగా



సన్మానించారు.ఈ సందర్భంగా బుక్క వేణుగోపాల్ మాట్లాడుతూ,డవ రోజున సరస్వతి దేవి అలంకారంలో అమ్మవారి దర్శనం కలగటం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని, అదేవిధంగా ప్రజలను సుఖశాంతులతో సిరిసంపదలతో తల తూగాలని అమ్మవారిని ప్రార్థించానని తెలిపారు.అనంతరం బాలబాలికలకు నోటు బుక్కులను, పలకలు అందజేశారు..ఈ కార్యక్రమంలో నాన్న వాళ్ళ కుమార్, రాజేందర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## వర్గీకరణ పై ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదు

### -టిఆర్ఎస్ నేతల ధ్వజం...



ప్రజావినికిడి,(హైదరాబాద్):అక్టోబర్ 9:ఎస్సి వర్గీకరణ పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పట్ల నేడు తెలంగాణ భవన్ లో మాజీ ఎమ్మెల్యేలు, సోదరులు డా.తాటికొండ రాజయ్య,సుంకే రవిశంకర్,గువ్వల బాలరాజ్,మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొమ్ముల నరేందర్ లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది.సుప్రీం కోర్టు తీర్పు తర్వాత అసెంబ్లీలో సభ్యుల మెప్పు పొందేందుకు అన్ని రాష్ట్రాల కంటే ముందే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పి మోసం చేస్తున్న నయవంచకుడు రేవంత్ రెడ్డి అని వారు దుయ్యబట్టారు. రైతులను మోసం చేసినట్లు మాదిగలను మోసం చేయాలనుకుంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అని, రేవంత్ రెడ్డికి మాదిగలు అంటే చిన్నచూపు అని,మాదిగలకు మంత్రివర్గంలో, నామినేటెడ్ పదవుల్లో చోటు ఇవ్వకుండా మాదిగ ద్రోహిగా రేవంత్ రెడ్డి మారారని వారు తీవ్రంగా విమర్శించారు.రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## బకాయిపడిన డిఎలు,పెండింగ్ బిల్లులు,ఎంపిహెచ్ ఏ (ఎఫ్) రిక్రూట్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలి..

### తెలంగాణ మెడికల్ & పబ్లిక్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్1 రాష్ట్ర కమిటీ డిమాండ్...




ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 9,యూనియన్ రాష్ట్ర కార్యవర్గం తో కలిసి వ్యవస్థాపక అధ్యక్షులు కర్నాటి సాయి రెడ్డి రాష్ట్ర కార్యాలయం లో పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల కు బకాయి పడిన నాలుగు వాయిదాల డిఎలు ప్రకటించాలని, ఈ - కుబేర్ నందు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు.తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం మూడు వాయిదాల కరువు భత్యం (డిఎ) ను విడుదల చేయకుండా బకాయి పడింది. ఉద్యోగులకు సంబంధించిన జిపిఎఫ్,టిఎస్ జిఎల్ఐ,సప్లిమెంటరీ వేతనాలు,సరెండర్ లీవులు,గత పిఆర్సీ బకాయిలు,మార్చి నుండి ఉద్యోగ విరమణ పొందిన వారికి పెన్షనరీ బెనిఫిట్స్ తదితర వేలాది బిల్లులు ట్రెజరీల్లో ఆమోదం పొందినప్పటికీ సంబంధితుల ఖాతాల్లో జమ కావడం లేదు.010 పద్దు ద్వారా వేతనాలు పొందుతున్న ఉద్యోగులకు నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్లు రెగ్యులర్ రిక్రూట్ మెంట్ నోటిఫికేషన్ లు వేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు

కానీ వైద్య ఆరోగ్య శాఖ లోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెల మొదటి తేదీన వేతనాలు అందటం లేదు.అలాగే దశాబ్దాలుగా వివిధ పద్ధతుల్లో 2 ఏఎన్ ఎంఎస్,ఈసీ,ఆర్ సి హెచ్,హెచ్ఆర్డి, అర్బన్,కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ లో పనిచేస్తున్న ఏంపిహెచ్ ఏ (ఎఫ్) లను ఎలాంటి పరీక్షలు లేకుండా రెగ్యులర్ చేసే విధంగా నిర్ణయం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పదిహేనురోజుల్లో పెండింగ్ లో ఉన్న మూడు డిఎలు ఇస్తామని, ఉద్యోగులందరికీ నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తామని, పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు.పది నెలలు గడిచినా డిఎలు, పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడం చేత ఉద్యోగులు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు.కనుక తక్షణమే బకాయి పడిన నాలుగు వాయిదాల డిఎలు ప్రకటించాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు.ఈ సమావేశంలో అధ్యక్షులు కర్నాటి సాయి రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ జి.రాజశేఖర్ తో పాటు ఈ క్రింది సభ్యులు పాల్గొన్నారు.

## కొత్తపేట శ్రీ భవాని మందిరం అమ్మవారి ఆధ్వర్యంలో మహా చెండి హెూమం..





ప్రజావినికిడి,(కొత్తపేట):

బుధవారం రోజుఉదయం అమ్మవారి అభిషేకం అర్చన చండీ హెూమం మధ్యాహ్నం అన్న దాన కార్యక్రమం చేశారు.ఈ చెండి హెూమ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేశారు.ఆలయ చైర్మన్ ఋషి మాట్లాడుతూ, కొత్తపేట శ్రీ భవాని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు మొక్కుకుంటే ఆ మొక్కలను అమ్మవారు తీరుస్తుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు.ప్రతి సంవత్సరం ఈ అమ్మవారి ని నమ్ముకున్న వారు భక్తుల సంఖ్య అధికంగా అయితున్నందుకు చాలా సంతోషంగా ఉందని అమ్మవారి కోరికలు తీర్చే అమ్మవారు

శ్రీ భవాని భవాని మాత ఈ ప్రాంతంలో స్వయంగా వెలిసిన అమ్మవారుగా ప్రసిద్ధిగాంచిందిగా ఇక్కడ అమ్మవారిని దర్శించుకుని ఏ మొక్కలు కోరుకున్న భక్తులకు అమ్మవారు కొంగుబంగారమై వీరా జిల్లుచున్నది.ఈ కొత్తపేట ప్రాంతం నుండి కాకుండా ఇతర ప్రాంతాల వారు అలాగే ఇతర జిల్లాల నుండి కూడా చాలామంది భక్తులు విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు అవుతున్నారు శరన్నవరాత్రి సందర్భంగా విశేష పూజలు హెూమాలు అన్నదాన శమీ పూజ అలాగే వాహన పూజలు మహాశివరాత్రి సందర్భంగా కూడా ఈ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు జరుగుతాయని పూజారి జగదీష్ శర్మ ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో

కొత్తపేట శ్రీ భవాని మందిరం చైర్మన్ గంజి బావనా ఋషి,వైస్ చైర్మన్ కాటంరాజు, కన్వీనర్ ఆకారం రవీందర్,కన్వీనర్ బుక్కరమేష్ గుప్తా, వేణు మేనేజర్ ఆలయ పూజారి జగదీష్ శర్మ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బాలయ్య నగర్ లో అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ రావుల శేషగిరి..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి బాలయ్య నగర్ లో దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలోకమిటీసభ్యులునగేష్, పార్వతి,సునీల్,కుమార్,వర్మ రాంబాచన్ వినోద్, సహని,సతీష్ శర్మ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికత సద్వినియోగంతో ఉజ్వల భవిష్యత్..

### షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్

### షాద్ నగర్ లో జింగిఫుడ్ డెలివరీ ఆప్ సర్వీసులు ప్రారంభం




ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటే ఎంచుకున్న రంగంలో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని, యువత తమ స్వశక్తితో ముందుకు సాగి కొత్త ఆలోచనలతో నిలవాలని షాద్నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్ అన్నారు. ఆన్లైన్లో ఫుడ్ డెలివరీ సర్వీసులు అందజేస్తున్న జింగీ ఫుడ్ డెలివరీ యాప్ ను షాద్ నగర్ లో బుధవారం యాప్ నిర్వాహకులు సురేష్ సీఈఓ మురళీకృష్ణ తో కలిసి ప్రారంభ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ నరేందర్ కౌన్సిలర్లు ఈశ్వర్ రాజు సుధీర్ లతో కలిసి హాజరై యాప్ ను ల్యాప్టాప్ ద్వారా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నరేందర్ మాట్లాడుతూ,వ్యాపార రంగంలో రాణించాలంటే సమయపాలన, నాణ్యత సత్ఫలితాలను ఇస్తాయని, వాటికి అనుగుణంగా సాంకేతికత ను ఉపయోగించుకుంటే మరింతగా రాణిస్తారని ఆయన అన్నారు. నిర్వాహకులు ప్రారంభించిన జింగి ఫుడ్ ఆన్లైన్ డెలివరీ బిసినెస్ బాగా జరగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం యాప్ నిర్వాహకులు సురేష్, సీఈఓ మురళి కృష్ణ లు మున్సిపల్ చైర్మన్ నరేందర్ ను,కౌన్సిలర్లు సుదీర్,ఈశ్వర్ రాజులను శాలువా లతో ఘనంగా సన్మానించి మెమంటోలను అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సీనియర్ జర్నలిస్టు లక్కాకుల రమేష్, ఖాజా సొహెల్, బైరమోని మహేష్, దీన్నరం శంకర్,ఎస్. బీ.బాలు,మల్లేష్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## దుండిగల్ పురపాలక కార్యాలయంలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబురాలు..

### వేడుకల్లో పాల్గొన్న దుండిగల్ పురపాలక చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ...




ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్)::

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండిమైసమ్మలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న దుండిగల్ పురపాలక చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ ... ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఆటా పాటలతో ఘనంగా సంబురాలు జరిపారు.. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రమాదేవి, పీసరి బాలమని కృష్ణా రెడ్డి, కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, ఆర్.వో సునంద, మరియు మునిసిపల్ మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి కి శుభాకాంక్షలు.. : కొలన్ హన్మంత్ రెడ్డి



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి బుధవారం తెలంగాణ రాష్ట్ర శాసమండలి చీఫ్ విప్ గా పదవి బాధ్యతలు తీసుకుంటున్న సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ధమ్మని శ్రావణ్ కుమార్, డాక్టర్ అవిజే.జేమ్స్ ,సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, ఎన్.ఎం.సి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి కి శుభాకాంక్షలు...

### కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ రాజశేఖర్ రెడ్డి



ప్రజావినికిడి, (కుత్బుల్లాపూర్):

తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చీఫ్ విప్గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి మరియు ఎన్ ఎంసి కాంగ్రెస్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

## శరన్నవరాత్రి పూజలో క్రాంతి యూత్



ప్రజావినికిడి సైదాబాద్: సైదాబాద్, సుబ్రహ్మణ్యం కాలనీ,శ్రీ క్రాంతి యూత్ అసోసియేషన్, దేవీ శరన్నవరాత్రుల ఏర్పాటు చేసిన మండపంలో చీకోటి ప్రవీణ్, ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు, ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న,ప్రవీణ్,రాకేష్,సాయికిరణ్,విగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు...

### పాల్గొన్న కాటూరి రమేష్...



ప్రజావినికిడి,(జూబ్లీహిల్స్):అక్టోబర్ 9:జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బిజేఆర్ నగర్ లో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ధనమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా బతుకమ్మ సంబరాలు జరిగాయి.ఈ బతుకమ్మ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షులు కాటూరి రమేష్,గుంజ ఆంజనేయులు, ధనమ్మ,మల్లేశ్వరి, ఎం.శంకరమ్మ, బి.సరస్వతి,సావిత్రి, నీలమ్మ,కోటేశ్వరమ్మ, మౌనిక,రేణుక, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు.

### : నర్సారెడ్డి భూపతిరెడ్డి..



ప్రజావినికిడి, (కుత్బుల్లాపూర్):

తెలంగాణ రాష్ట్ర శాసనమండలిలో చీఫ్ విప్ గాఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి

## తెలంగాణ రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును సన్మానించిన దమ్మని శ్రవణ్ కుమార్..అవిజే జేమ్స్..




ప్రజావినికిడి, (కుత్బుల్లాపూర్):

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం తెలంగాణ రాష్ట్ర ఐటి మినిస్టర్ శ్రీధర్ బాబుని కలిసి మర్యాదపూర్వకంగా సన్మానించిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేడ్చల్ మల్కాజిగిరి డి.సి.సి ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్,ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు ఆవిజ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# ఓడిపోతే ఇవిఎంలది తప్పా ?

హైదరాబాద్,అక్టోబర్ 09/ప్రజావినికిడి:
హర్యానా, జమ్ముకాశ్మీర్ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. హర్యానాలో బిజెపి బ్యాట్రిక్ విజయం సాధించగా కాశ్మీర్‌లో ఇండియా కూటమి గెలిచింది. ఎన్‌సితో పొత్తు ద్వారా కాశ్మీర్‌లో కాంగ్రెస్ కొన్ని సీట్లు సాధించుకో గలిగింది. ఇక హర్యానాలో గెలుస్తారని సర్వేలు చెప్పినా..అనూహ్యంగా బిజెపి పుంజుకుని విజయం సాధించింది.ఇంతవరకు బాగానే ఉన్నా..మరోమారు కాంగ్రెస్ తన అనుమానాలను బయటపెట్టింది. ఇవిఎంల ట్యాంపరింగ్ అంటూ పాత పాట పాడింది. కాశ్మీర్‌లో కూడా ట్యాంపరింగ్ జరిగివుంటే బిజెపి గెలిచేది. హర్యానాలో ట్యాంపర్ చేసిన బిజెపి,కాశ్మీర్‌ను మాత్రం వదులుకుంటుందా అన్నదే ప్రశ్న. కాంగ్రెస్ ఆరోపణలు చేస్తే రెండు రాష్ట్రాలపై చేయాలి. వారు గెలిచిన కర్నాటక, తెలంగానల పైనా చేయాలి. కానీ గెలిచిన చోట వదిలి ఓడిన చోట ట్యాంపరింగ్ అంటే ప్రజలు నమ్మడానికి సిద్దంగా లేరు. పదేళ్ల యూపిఎ పాలన అంతా ట్యాంపరింగ్ గెలుపుతో నడిచిందా అన్నది కూడా కాంగ్రెస్ చెప్పాలి. ట్యాంపరింగ్ అనుమానాలపై ఇప్పటికే నివృత్తి జరిగింది. ఇసి పలు సందర్భాల్లో వాటిని ఎలా వినియోగిస్తున్నదీ వివరించింది. టెక్నికల్ టీమ్ వాటిని సరిచూసింది. ఈ క్రమంలో ఇవిఎంలపై అనుమానాలను మాత్రం బిజెపి కొట్టి పారేస్తోంది. సాంకేతికత అభివృద్ధి చెందిన తరుణంలో దీనిపై అనుమానాలు అక్కర్లేదు. ఇవిఎంల ట్యాంపరింగ్ పై అనుమానాలు వ్యక్తం చేస్తూ..తమను ప్రజలు తిరస్కరించారన్న నిజాన్ని కాంగ్రెస్ అంగీకరించడం లేదని అందరూ గుర్తుంచుకోవాలి. గతంలో అనేకమార్లు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ ఈ విషయంలో ఆనాడు అనుమానాలు వ్యక్తం చేయలేదు. తాజాగా ఇప్పుడు మారోమారు ఇవిఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఇవిఎంలతోనే గతంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ నిస్సిగ్గుగా మాట్లాడడం దారుణం కాక మరోటి కాదు. ఇకపోతే కాంగ్రెస్ ఒంటరిగా పోటీచేస్తున్నప్పుడల్లా ఓటమి చెందుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియాకూటమితో పోవడంతోనే ఈ మాత్రం సీట్లు సాధించగలిగింది.హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి శరాఘాతంగా మారడంతో నెపాన్ని ఇవిఎంలపైకి నెట్టేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఓ 30 పార్టీలతో జతకట్టి 'ఇండియన్ నేషనల్ డెవలప్ మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ ఇండియా పేరుతో కూటమిని కట్టి భారతీయ జనతా పార్టీని కొంత మేర నిలువరించగలిగింది. అంతే తప్ప బీజేపీ సారథ్యంలోని 'నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఎన్‌డిఎ విజయాన్ని మాత్రం అడ్డుకోలేకపోయింది. గత పదేళ్లలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను చూస్తే బీజేపీతో ముఖాముఖి తలపడ్డ అనేక సందర్భాల్లో




ఓటమి పాలవుతూ వస్తోందని అర్థమవుతోంది.తాజాగా జరిగిన రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగా బీజేపీని ఢీకొట్టలేక హర్యానాలో చతికిలపడగా.. జమ్ము-కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ తో జతకట్టి గెలుపును సొంతం చేసుకుంది. ఇంకా లోతుగా వెళ్తే.. ఇక్కడ బీజేపీతో కాంగ్రెస్ నేరుగా తలపడ్డ చోట్ల కమలదళానిదే పైచేయి. కాంగ్రెస్ పోటీ చేసిన 39 సీట్లలో కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. కాంగ్రెస్ గెలిచిన సీట్లలో ఒక్కటి కూడా హిందూ జనాభా ఎక్కువగా ఉన్న సీటు లేదు. గెలిచిన అభ్యర్థుల్లో ఒక్కరు కూడా హిందువు లేరు. దీన్ని బట్టి ఆ కొన్ని సీట్లు కూడా నేషనల్ కాన్ఫరెన్స్ పుణ్యమే అని స్పష్టమవుతోంది. హర్యానాలో జాట్-దళిత-మైనారిటీ కాంబినేషన్‌తో ఒంటరిగా గెలుపొందాలని చేసిన ప్రయత్నం చాలావరకు కలిసొచ్చినా.. జాటేతర వర్గాలు బీజేపీ వైపు ఏకీకృతం కావడంతో అనుకున్నది సాధించలేకపోయింది. కనీసం ఆమ్ ఆద్మీ పార్టీ, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, బహుజన్ సమాజ్ పార్టీలలో ఏ ఒక్క పార్టీతో పొత్తు పెట్టుకున్నా పరిస్థితి మరోలా ఉండేదని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఎందుకంటే బీజేపీ,
కాంగ్రెస్ సాధించిన ఓట్ల శాతంలో వ్యత్యాసం 1 శాతం కంటే తక్కువే. బీజేపీ 39.94 శాతం ఓట్లతో 48 సీట్లు గెలుపొందగా, కాంగ్రెస్ 39.09శాతం ఓట్లు సాధించినప్పటికీ 37 సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. అనేక నియోజకవర్గాల్లో గెలుపోటముల మధ్య తేడా వందల్లోనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఏ ఇతర పార్టీతో జతకట్టినా కాంగ్రెస్ అధికారం సాధించగలిగేదని స్పష్టమవుతోంది. జాతీయస్థాయిలో బీజేపీని ఓడించడమే ఏకైక లక్ష్యంగా 30 పార్టీలను ఏకతాటిపైకి తెచ్చిన కాంగ్రెస్, అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో కొన్నిచోట్ల మాత్రం తాను మాత్రమే గెలవాలి.. మరొకరికి భాగం ఉండరాదు అన్నట్టుగా వ్యవహరించింది. తనకు తగిన బలం లేదు అనుకున్న రాష్ట్రాల్లో మాత్రమే స్థానికంగా బలంగా ఉన్న ప్రాంతీయపార్టీలతో జట్టుకట్టి పోటీ చేస్తోంది. 2022లో మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో బీజేపీతో కాంగ్రెస్ నేరుగా తలపడి ఓటమిపాలైంది. ఉత్తరాదిన హిమాచల్‌లో మాత్రమే గెలుపొందగలిగింది. తెలంగాణలో విజయం సాధించినప్పటికీ.. అక్కడ పోటీపడింది కేవలం బీజేపీతో మాత్రమే కాదు. అప్పటి వరకు తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితితో తలపడి ముక్కోణపు పోటీలో 39 శాతం ఓట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఈ లెక్కన చూస్తే బీజేపీతో నేరుగా తలపడడంలో కాంగ్రెస్ తడబడుతోందని స్పష్టమవుతోంది. ఓ ఇద్దరు ముగ్గురిని వెంటేసుకుని వెళ్తేనో.. లేకపోతే ముక్కోణపు పోటీ లేదా బహుముఖ పోటీ ఉన్నప్పుడో కాంగ్రెస్ విజయాలు సాధించగల్గుతోంది. ఈ విజయాలను విశ్లేషించుకుని కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగాలి. ఇవిఎంలపై నెపాన్ని నెట్టేసి, అది మోడీ కుట్ర అంటూ సాగితే ప్రజలు స్వాగతించరని గుర్తించాలి. హర్యానాలో ఓటమి గుణపాఠం కావాలి. మరింత పట్టుదలగా పనిచేయాలి. అధికారం ఉన్న రాష్ట్రాల్లో ఆదర్శ పాలన అందించాలి. ఢిల్లీ ప్రదక్షిణలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. చీటికిమాటికీ మంత్రులు, ముఖ్యమంత్రులను ఢిల్లీకి పిలిపించుకునే సంస్కృతి పోవాలి. కాంగ్రెస్ తన లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగితేనే ప్రజలు ఆదరిస్తారు.

# కాలుష్య నివారణలో భాగస్వాములు కండి

- నిపుణులకు పవన్ కల్యాణ్ పిలుపు
- పర్యవరణ పరి రక్షణకు సూచనలివ్వండి
- నిపుణులకు పవన్ కల్యాణ్ పిలుపు



విజయవాడ:అక్టోబర్ 09/ప్రజావినికిడి:
కాలుష్య నివారణకు ప్రణాళికలు అవసరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఏ పనైనా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ ముఖ్యమన్నారు. పర్యావరణం బాగుండాలని కోరుకునే వాళ్లలో తానూ ఒకరినని తెలిపారు. పర్యావరణ హితం అనేది పరిశ్రమల బాధ్యత కావాలి. అభివృద్ధిలో భాగమయ్యే పరిశ్రమలు భావి తరాలకు చక్కటి పర్యావరణం అందించడం కూడా తమ బాధ్యతగా గుర్తించాలని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కావాలి.. అభివృద్ధి అవసరం అయిన నేటి తరుణంలో పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదే సమయంలో సాధ్యమైనంతగా కాలుష్య రహిత పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు.విజయవాడలోని ఓ హెూటల్ లో బుధవారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఎన్జీవోలు, నిపుణులు, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన వర్క్ షాపును పవన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "భావి తరాలకు భవిష్యత్తు లేకుండా చేసే అభివృద్ధి సరికాదు. కాలుష్య నియంత్రణ మండలి అనగానే పరిశ్రమలకు వ్యతిరేకం అనే భావన సరికాదు. ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణాన్ని కాపాడుకోవడం, అభివృద్ధిపథంలో ముందుకు సాగడం అనేవి రెండూ కీలకమైనవే. దీనికి తగిన మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది. నిపుణులు దీనిపై దృష్టి పెట్టాలి. విశాఖపట్నంలో కాలుష్యం విషయంలో కాని, ఇతర ప్రాంతాల్లో తీవ్రమవుతున్న కాలుష్యం విషయంలో శాశ్వతమైన పరిష్కారం, అందరూ ఆమోదించేలా విధానం తీసుకురావల్సిన అవసరం ఉంది అని పేర్కొన్నారు.పరిశ్రమల్లో కాలుష్యంతోపాటు ప్రమాదాలు ఈ మధ్య కాలంలో ఎక్కువవుతున్నాయి. వీటి నివారణకు ఓ మార్గం చూపాలి. 974 కిలోమీటర్ల కోస్టల్ కారిడార్ ఉంది. దానిని అభివృద్ధి చేయాలి. పర్యావరణ సమతౌల్యం దెబ్బ తినకుండా పరిశ్రమల ఏర్పాటు కావాలి. భవిష్యత్ తరాల కోసం.. మనమంతా ఇప్పటి నుంచే ఆలోచన చేయాలి. జల, వాయు కాలుష్యాలను నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. వేగవంతమైన అభివృద్ధి కోసం ప్రభుత్వం తపిస్తున్న సమయంలో కాలుష్య రహిత పరిశ్రమలు, వాటి విధివిధానాల రూపకల్పనకు నిపుణులు, మేధావులు విలువైన సూచనలు అందించాలి. ఈ వర్కుషాపు ద్వారా పరిశ్రమల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణ రెండు అంశాలపై వేసే అడుగులపై అందరికీ స్పష్టత వస్తుంది. ఈ ఐదేళ్ల కాలంలో ఎంతవరకు కాలుష్యాన్ని నియంత్రించాలనే అంశంపై ఆలోచన చేస్తున్నాం. పర్యావరణ పరిరక్షణకు అందరూ సమష్టిగా పని చేయాలి" అన్నారు.

# కొత్త కార్డులొస్తున్నాయ్

**4 వేల కొత్త రేషన్ దుకాణాల ఏర్పాట్లు, డీలర్ల పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయం**

**రేషన్‌కార్డులు పొందేందుకు ఆదాయ పరిమితి సడలింపు!**




విజయవాడ:అక్టోబర్ 09/ప్రజావినికిడి:
రేషన్ కార్డు లేని అర్హులైన పేదలకు త్వరలోనే వాటిని మంజూరు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్‌కార్డుల్లో పేరు మార్పు చేర్పులకు కూడా అవకాశం ఇవ్వనుంది. కుటుంబ సభ్యుల పేర్ల తొలగింపు, చేర్పు, కుటుంబాల విభజన, అడ్రస్ మార్పు, కార్డులను ప్రభుత్వానికి సరెండర్ చేయడం వంటి వాటిపైనా నిర్ణయం తీసుకోనున్నారు.రేషన్‌కార్డులు పొందాలంటే గ్రామీణ ప్రాంతాల్లో రూ. 10 వేలు, పట్టణ ప్రాంతాల్లో నెలవారీ ఆదాయం రూ. 12 వేలు మించకుండా ఉండాలని గత ప్రభుత్వం నిబంధనలు విధించింది. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రేషన్‌కార్డు కోల్పోయారు. ప్రభుత్వ పథకాలకు తామంతా దూరమయ్యామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయ పరిమితిని పెంచి తమకు కూడా రేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ విషయంలోనూ ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.
కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తిచేసుకున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే మంత్రివర్గ సమావేశంలో దానిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. వాహనాల ద్వారా రేషన్ పంపిణీపైనా నిర్ణయం తీసుకోనుంది. ఖాళీగా ఉన్న ఆరువేల రేషన్ డీలర్ల పోస్టులను భర్తీ చేయడంతోపాటు కొత్తగా 4 వేలకు పైగా దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు.

# పంట నష్ట సాయం రూ.79కోట్లు విడుదల

హైదరాబాద్,అక్టోబర్ 09/ప్రజావినికిడి:
ప్రకృతి వైపరిత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం కింద బుధవారం నిధులు విడుదల చేసింది. సమగ్ర నివేదికల పరిశీలన అనంతరం మొత్తం రూ. 79.57కోట్లు విడుదల చేసింది.ఈ నిధులను నేరుగా 79216మంది రై తుల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తోంది. ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 6 వరకు కురిసిన భారీ నుండి అతిభారీ వర్షాల వలన రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాలలో 79,574 ఎకరాలలో పంటనష్టం సంబవించినట్లు అధికారులు నిర్ధారించగా, దానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో కేవలం నెల రోజుల విడుదలయ్యాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అత్యధికంగా పంటనష్టం ఖమ్మం జిల్లాలో 28,407 ఎకరాలు, తరువాత మహబూబాబాద్ 14,669, సూర్యాపేట 9,828 ఎకరాలు సంబవించినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. మిగతా 22 జిల్లాలకు సంబంధించి అత్యల్పంగా 19 ఎకరాల నుండి 3,288 ఎకరాల వరకు పంటనష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు నిర్ధారించారు. పంటనష్ట పరిహారం కింద ఎకరానికి రూ.10 వేల చొప్పున నేరుగా రైతులకు చెందిన బ్యాంకు ఖాతాలలోనే జమ అయ్యేటట్లు అధికారులు తగిన ఏర్పాట్లు చేసినట్లు వ్యవసాయ ఉద్యాన శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



వ్యవధిలోనే పంటనష్టపోయిన రైతులకు పరిహారం కింద రూ. 79.57 కోట్ల నిధులు

# లంచగొండి భార్యను పట్టించిన భర్త

నార్సింగి:హైదరాబాద్,అక్టోబర్ 09/ప్రజావినికిడి:
ఉన్నతమైన ఉద్యోగం, మంచి నెలసరి జీతం, అందమైన కుటుంబంతో ఎంతో ఆనందంగా జీవించాలనుకున్న భర్త ఆశలపై నీరుజల్లి అతని ఆశలను అడియాశలు చేసింది,కట్టుకున్న భార్య. ప్రేమించి పెళ్ళి చేసుకున్న పాపానికి నిత్యం నరకం అనుభవిస్తూ ఇక తన వల్ల కాదని భార్య అవినీతి భాగోతాన్ని బట్టబయలు చేసాడు భర్త. వివరాలకు గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీలో డిఈఈగా విధులు నిర్వహిస్తున్న దివ్యజ్యోతి, అవినీతి ముసుగులో లంచగొండిగా మారి విచ్చలవిడిగా కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తూ వారి వద్ద నుండి కోట్లాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్న-దని ఆమె భర్త శ్రీపద్ పేర్కొంటూ వారి ఇంట్లో పలు చోట్లలో అక్రమంగా దాచిన కోట్లాది రూపాయల డబ్బుల కట్టలను వీడియోల ద్వారా భర్త సామాజిక మాధ్యమాలలో చూపించటం స్థానికంగా కలకలం రేపింది. గత నెలలో వీరు విడాకుల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.గత మూడు సంవత్సరాలుగా మణికొండ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తూ, మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం




కేటాయించిన కోట్లాది రూపాయలను ఇష్టానుసారంగా తనకు నచ్చిన కాంట్రాక్టర్ల ద్వారా తక్కువ మెత్తంలో టెండర్లను వేయించి, వారికే టెండర్లు దక్కేలా చేస్తూ ఆ శాఖలో ఏఈ, డిఈఈ గా తానే ఏకచక్రాధిపత్యం వహిస్తూ, ఏకంగా మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ పద్దతిలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగి భర్తతో కుమ్మక్కై ఆతనికే ఎక్కువ మెత్తంలో కాంట్రాక్టులు వచ్చేలా చేస్తూ కోట్ల రూపాయల సొమ్మును కాజేసేదన్నారు. అంతే కాకుండా గతంలో కౌన్సిల్ లో కోటి రూపాయలతో తీర్మానం చేస్తే దానిని నాలుగున్నర కోట్లకు చూపటంతో కొందరు కౌన్సిలర్లు కలిసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేసారన్నారు. తాను చేస్తున్న అవినీతిని బయటపెడతానని భర్త హెచ్చరించటంతో తన అవినీతి బయటపడుతుందని భావించిన తాను 3 రోజుల క్రితమే జిహెచ్ఎంసి కార్యాలయానికి బదిలీ చేయించుకున్నదన్నారు.
తనకు ధన దాహమే తప్ప తనకు మరో ఆలోచన ఉండేది కాదని, చిన్న బాబుని కూడా పట్టించుకోకుండా అర్థరాత్రి సమయాలలో ఇంటికి వచ్చేదని, తాను ఉద్యోగం చేస్తానన్న వద్దని వారించి గొడవ చేస్తూ, కోట్ల రూపాయల డబ్బులను తన సోదరులకు అందించేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉంటే మణికొండ మున్సిపాలిటీలో పలు శాఖలలో అవినీతి తిమింగళాలు పట్టుబడుతున్న ఇంత దర్జాగా అనినీతికి పాల్పడటం వెనుక దాగి ఉన్న పెద్దలు ఎవరని స్థానిక ప్రజలలో మెదులుతున్న ప్రశ్న. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి అవినీతికి పాల్పడిన వారిపైన తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పేర్కోన్నారు.

# ఖరీఫ్ కోసం సమగ్ర వరి సేకరణ ప్రణాళిక




హైదరాబాద్,అక్టోబర్ 09/ప్రజావినికిడి:
రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఖరీఫ్ సీజన్‌లో వరి సేకరణకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసిందని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు .
సేకరణ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, వ్యవసాయ శాఖ ఆన్‌లైన్ వరి నిర్వహణ వ్యవస్థ (%ట్రామీ%)తో పంట డేటాను పంచుకుంటుంది, ఇది రాష్ట్రంలో పండించే వరి రకాలపై ఖచ్చితమైన సమాచారాన్ని నిర్ధారిస్తుంది. ఈ వ్యవస్థ రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తూ సమర్ధవంతమైన సేకరణను అనుమతిస్తుంది. సన్నారకం వరికి క్వింటాల్‌కు రూ.500 ప్రోత్సాహకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు పౌరసరఫరాల శాఖ సమగ్ర అవగాహన ప్రచారాన్ని నిర్వహిస్తుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అదనంగా, వ్యవసాయ శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి, 'సన్నారకం' వరిని సరైన గుర్తింపును నిర్ధారించడానికి %బ్రాజ% సిబ్బందికి శిక్షణా సమావేశాలు నిర్వహించబడతాయిసన్నారకం' మరియు 'దొడ్డురకం' వరి రకాలను సేకరించేందుకు ప్రత్యేక %బ్రాజ%లను ఏర్పాటు చేస్తారు, ఆయా జిల్లాల కలెక్టర్లు నిర్ణయించిన స్థానాలతో. ఈ కేంద్రాల్లో 'సన్నారకం' వరి నాణ్యతను అంచనా వేయడానికి డిజిటల్ గ్రెయిన్ కాలిపర్‌లు, పొట్టు తొలగించే యంత్రాలు వంటి ప్రత్యేక పరికరాలను అందజేస్తారు. సులువుగా గుర్తించడం కోసం 'సన్నారకం' వరి సంచులను ఎరుపు దారంతో కుట్టించగా, 'దొడ్డురకం' సంచులను ఆకుపచ్చ దారంతో కట్టాలి. రెండు రకాలను %బ్రాజ%ల నుండి మిల్లులకు విడివిడిగా రవాణా చేస్తారు, ఇక్కడ రైస్ మిల్లర్లు వాటిని రకాలుగా కలపకుండా ఉండేందుకు వాటిని నిర్ణీత విభాగాలలో నిల్వ చేస్తారు. కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను మిల్లర్లకు అందజేసేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు.
అయితే రాష్ట్ర ప్రభుత్వం పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టిస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రభుత్వం మిల్లర్లను పురోగతిలో భాగస్వాములుగా భావించి, ఎలాంటి అవకతవకల ద్వారా తెలంగాణ ఖజానాకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఫీమేల్ లీడ్ రోల్‌గా సంయుక్త మూవీ

## క్లాప్ కొట్టిన నటుడు దగ్గుబాటి రానా



భీమ్లా నాయక్' సినిమాలో పవన్ కళ్యాణ్, నిత్యా మీనన్ ఒక జంటగా నటిస్తే.. మరో జంటగా రానా దగ్గుబాటి, సంయుక్త నటించారు. ఈ సినిమాలో నిత్యామీనన్ పాత్రకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో అంతే ప్రాముఖ్యత సంయుక్త పాత్రకు కూడా ఉంటుంది. ఆ పాత్రలు వారిద్దరికీ మంచి పేరునే తెచ్చిపెట్టాయి. ఇక ఇప్పటి వరకు హీరోల పక్కన నటిస్తూ సక్సెస్ అందుకుంటున్న సంయుక్త తొలిసారి ఫిమేల్ సెంట్రిక్ యాక్షన్ థ్రిల్లర్‌తో తన సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఆమె ప్రధాన పాత్రలో నటించబోతున్న చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమవగా.. ఈ సినిమాకు క్లాప్‌ను 'భీమ్లా నాయక్'లో తనకు భర్తగా నటించిన రానా దగ్గుబాటి కొట్టారు. ఈ సినిమా వరుస బ్లాక్‌బస్టర్స్ సినిమాలతో అలరిస్తున్న టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త తొలిసారిగా ఫీమేల్ సెంట్రిక్ మూవీ చేస్తున్నారు. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి సెన్సేషనల్ హిట్ చిత్రాలను అందించిన సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండా నిర్మించనున్న ఈ చిత్రానికి యోగేష్ కెఎంసి దర్శకుడు. మాగంటి పిక్చర్స్‌తో కలిసి హాస్య మూవీస్ ప్రొడక్షన్ నంబర్ 6గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని సంయుక్తనే సమర్పిస్తోంది. బుధవారం రామానాయుడు స్టూడియోస్‌లో పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది.

# వార్-2లో విలన్‌గా ఎన్టీఆర్




తారక్ లేటెస్ట్ ఫిల్మ్ 'దేవర' హిట్టవ్వడంతో ఆయన మరింత జోష్‌లో సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ప్రశాంత్ నీల్ ఎన్‌టిఆర్31తో పాటు యశ్ రాజ్ ఫిల్మ్స్ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ లోని వార్ 2 సినిమాలో పనిచేస్తున్నాడు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ హీరోగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఎన్టీయార్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలో తారక్ -హృతిక్ రోషన్‌కు మధ్యలో భారీ యాక్షన్ ప్యాక్‌డ్ సీక్వెన్సెస్ ప్లాన్ చేస్తున్నారు. ఈ యాక్షన్ సీక్వెన్స్‌కి సంబంధించిన ఓ అప్డేట్ బయటకొచ్చింది.. స్పై యూనివర్స్‌లో భాగంగా నిర్మిస్తున్న ఈ ఫిల్మ్ షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే సినిమా మేజర్ పోర్షన్ షూటింగ్ పూర్తయింది. ఎన్టీయార్, హృతిక్ రోషన్ మధ్య జరగనున్న యాక్షన్ ప్యాక్‌డ్ క్లైమాక్స్ ఒక్కటి ఇంకా బాకీ ఉంది. దీంతో వచ్చే ఏడాది నవంబర్‌లో ఈ పార్ట్‌ని చిత్రీకరించడానికి సినీ యూనిట్ సిద్ధమైంది. ప్రత్యేకమైన డైట్‌ని పాటిస్తూ ఇద్దరు హీరోలు కండలు తిరిగిన శరీరాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే వీరిద్దరి మధ్య 'హ్యాండ్ టూ హ్యాండ్' ఫైట్ సీక్వెన్సెస్ కూడా ఉండనున్నాయట. ఆర్ఆర్ఆర్ సినిమా తర్వాత గ్లోబల్ స్టార్ అవతారమెత్తిన తారక్‌కి ఇది బాలీవుడ్ డెబ్యూ కావడం విశేషం. అసాధారణమైన యాక్టింగ్, పవర్ ఫుల్ డైలాగ్ డిక్షన్, స్టైలిష్ డ్యాన్సులతో సకలవల్లభుడి గా తెలుగు ప్రేక్షకులకు మాత్రమే పరిమితమైన తారక్ ని బాలీవుడ్ తొలిసారి విట్ నెస్ చేయబోతుంది. డైరెక్టర్ ఆయాన్ ముఖర్జీ ఎన్టీయార్‌ని ఎలా ఉపయోగించుకొన్నాడని సర్వత్రా ఆసక్తి నెలకొంది. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా దర్శక నిర్మాత ఆదిత్యా చోప్రా ఇప్పటికే ఏక్తా టైగర్, టైగర్ జిందా హై, వార్, పఠాన్ సినిమాలని ఇన్‌క్లూడ్ చేశాడు. ఫ్యూచర్‌లో టైగర్ 3, ఆల్ఫా, పఠాన్ 2, టైగర్ వర్సెస్ పఠాన్ చిత్రాలను ప్లాన్ చేస్తున్నాడు.

# బాలీవుడ్‌లో సమంత ఇన్‌సైడరా? ఔట్ సైడరా?



అనన్య పాండే CTRLఇటీవల నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. సమంతా తన సోషల్ మీడియాలో అనన్య నటనపై ప్రశంసలు కురిపించింది. ఇది అనన్య, సమంతల అభిమానుల దృష్టిని ఆకర్షించింది. సమంత నిరంతరం హిందీ మీడియా వార్తల్లో నిలవడం కోసమే ఆమె ఇలా చేస్తోందని కొందరు అభిప్రాయపడ్డారు. అంతంత మాత్రం నటన, గ్లామర్ డాళ్ అప్పియరెన్స్ తో కనిపించే అనన్యను సమంత అంత ఇదిగా పొగిడేయడం వెనక ఏదైనా లాజిక్ ఉందా? అంటూ ఇప్పుడు రంధ్రాన్వేషణ జరుగుతోంది. దీనిని ఒక్కొక్కరూ ఒక్కోలా విశ్లేషిస్తున్నారు. అనన్య పాండే బాలీవుడ్ ఇన్ సైడర్. ఒక పాపులర్ నటుడి(చంకీ పాండే)కి నటవారసురాలు. అనన్యను పొగిడేయడం అంటే, అనన్య స్నేహితురాళ్లు అయిన సారా అలీఖాన్, సుహానా ఖాన్, జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ లాంటి నటవారసురాళ్లందరికీ బాసట పలికినట్టే. అలాగే షారూఖ్, చంకీపాండే, బోనీకపూర్, కరణ్ జోహార్ వంటి ప్రముఖుల దృష్టిలో తమ వ్యక్తి (ఇన్ సైడర్) అని కళ్లలో పడటం సులువు. సమంత ఒకే దెబ్బకు పది పిట్టలు అన్న చందంగా వారందరికీ కనెక్టయిపోతోంది. చివరికి ఇది సమంత బాలీవుడ్ కెరీర్ కి సహకరిస్తుందనేది వ్యూహం. అలాగే బాలీవుడ్ లో నవతరం దూకుడు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. వీరందరి నుంచి తనకు పోటీ అన్నది లేకుండా ఎలా వ్యూహం రచించాలో కూడా సమంతకు ఒక ఐడియా ఉందని కూడా ఊహిస్తున్నారు. ఫ్యామిలీమ్యాన్ 2 లో రాజీ పాత్ర, సిటాడెల్ హనీబన్నీలో సూపర్ గాళ్ పాత్రతో సమంత ప్రతిభపై అంచనా పెద్ద స్థాయిలో ఉంది. అందుకే ఇప్పుడు ఆచితూచి అడుగులేస్తోంది సమంత. అలాగే ఇన్ సైడర్స్ , ఔట్ సైడర్స్ టాపిక్ తో ఔట్ సైడర్స్ తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతిభ ఉండి కూడా ఇన్ సైడ్ సరైన సత్సంబంధాలు లేకపోతే ఇబ్బందే. ఇవన్నీ ఆలోచించి సామ్ తెలివిగా తన స్నేహాలను కొనసాగిస్తోందని విశ్లేషిస్తున్నారు. మరీ ఇంతగా ఆలోచించాల్సిన అవసరం లేకపోతే .. సామ్ యాధృచ్ఛికంగానే అనన్య పాండే వెబ్ షో చూశాక తనకు బాగా నచ్చేయడం వల్ల అలా స్పందించి ఉంటుందని కొద్దిమంది విశ్లేషిస్తున్నారు. మరికొందరు అనన్య పాండే ఏ లిస్టర్స్ లో ఉంది గనుక తాను కూడా అలాంటి వారితోనే స్నేహం చేయాలనుకుంటోందని విశ్లేషిస్తున్నారు. ఔట్ సైడర్స్ కి సానుకూలంగా ఉండటం వల్ల కూడా బాలీవుడ్ లో ఒదిగేదేమీ ఉండదు. అందుకే సమంత ఇలా చేస్తోందని అందరూ ఊహిస్తున్నారు.

# జనక అయితే గనక


## రిలీజ్ ట్రైలర్ విడుదల




టాలీవుడ్ కుర్ర హీరో సుహాస్ ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతున్నాడు. ఈ ఏడాది ఇప్పటికే అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, ప్రసన్న వదనం, శ్రీరంగ నీతులు, గొర్రె పురాణం అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాలను అందుకున్న ఈ యువ నటుడు ఇప్పుడు మళ్లీ ఒక కొత్త స్టోరీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. సుహాస్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'జనక అయితే గనక' సినిమాకు సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తుండగా.. బలగం, లవ్‌మీ వంటి విభిన్న తరహా సినిమాల తర్వాత దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్‌రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రిలీజ్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తే.. ఎల్‌కేజీ, యూకేజీలకే లక్షలు వసూలు చేస్తున్న ఈ కాలంలో ఒక మిడిల్ క్లాస్ యువకుడు(సుహాస్) తనకు పిల్లలు పుడితే వారిని ఎలా పెంచాలి, ఎలా చదివించాలి అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుంది. ఈ కాలంలో పిల్లలను పెంచడం కష్టమని పిల్లలు వద్దనుకుంటున్నా సుహాస్‌కు సడన్‌గా తన భార్య గర్భవతి అంటూ షాక్ ఇస్తుంది. అయితే తాను వాడిన కండోమ్ వలనే ఇలా అయ్యిందంటూ నాసిరకం కండోమ్‌లను సప్లయ్ చేస్తున్న కంపెనీపై కేసు పెడతాడు. అయితే ఈ కేసు సుహాస్ జీవితంలో ఎలాంటి మలుపు తీసుకుంది. చివరకు తాను కండోమ్ కంపెనీపై పెట్టిన కేసు గెలిచాడా అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాలో సుహాస్‌తో పాటు, సంగీత్, వేన్నెల కిషోర్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# యానిమల్‌తో ప్రశంసలు ..విమర్శలూ ఎదుర్కొన్నా

యానిమల్' మూవీతో ఒక్కసారిగా ఫేమ్ సొంతం చేసుకున్ననటి త్రిప్తి డిమ్రి ఆ సినిమా తర్వాత ఆమెకు బాలీవుడ్‌లో వరుస అవకాశాలు దక్కాయి. తన తదుపరి చిత్రం 'విక్కీ విద్య కా వో వాలా వీడియో' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. 'యానిమల్' తర్వాత తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి మాట్లాడారు. ఆ సినిమా వల్ల ఫేమ్ మాత్రమే కాదు విపరీతమైన విమర్శలు చూశానని అన్నారు.యానిమల్' విడుదలయ్యాక ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నా. జోయాగా యాక్ట్ చేసినందుకు నన్ను చాలామంది తిట్టారు. సోషల్‌మీడియా వేదికగా పలువురు నెటిజన్లు అసభ్యంగా ట్రోల్ చేశారు. వాటిని ఎలా తట్టుకోవాలో అర్థం కాలేదు. అలాంటి విమర్శలు ఎదుర్కొంటానని ఎప్పుడూ అనుకోలేదు. ఎంతో బాధపడ్డా. మానసికంగా ఆవేదనకు గురయ్యా. దానినుంచి బయటకు రావడం కోసం మూడు రోజుల పాటు ఏడుస్తూనే ఉన్నా. దానివల్ల బాధ కాస్త తగ్గింది. మనసు శాంతించింది. ఆ సమయంలో నా సోదరి ఎంతో సపోర్ట్‌గా నిలిచింది. నువ్వు ఏం చేశావో నీకు తెలుసు. కాబట్టి ఇతరుల మాటలు పట్టించుకోకు అని ధైర్యం చెప్పిందని తెలిపారు. రణ్‌బీర్ కపూర్, రష్మిక జంటగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించిన చిత్రం 'యానిమల్'. యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ఇది తెరకెక్కింది. జోయాగా అలరించారు త్రిప్తి డిమ్రి. కథలో భాగంగా ఆమెపై కొన్ని ఇంటిమేట్ సీన్స్ చిత్రీకరించారు. ఆ సీన్స్‌పై పలువురు అభ్యంతరం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత త్రిప్తికి దేశవ్యాప్తంగా అభిమానులు ఏర్పడ్డారు. 'నేషనల్ క్రష్' అని ట్యాగ్ ఇచ్చారు. అభిమానులు చూపిస్తోన్న ప్రేమపై గతంలో ఓ సందర్భంలో మాట్లాడారామె. 'బాలీవుడ్‌లో కెరీర్ మొదలుపెట్టి దాదాపు ఏడేళ్లు అయ్యింది. అందుకు సంతోషంగా ఉన్నా. గొప్ప నటీనటులు, దర్శకులతో వర్క్ చేస్తానని కెరీర్ ఆరంభంలో ఎప్పుడూ అనుకోలేదు. 'లైలా మజ్ను' తర్వాత నటనలో శిక్షణ తీసుకొన్నా. ప్రేక్షకులు నా నటనతో కనెక్ట్ అవుతున్నారని చెప్పారు.



• తృప్తి డిమ్రి

# రాజేంద్రప్రసాద్‌కు ప్రభాస్ పరామర్శ



సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇంట్లో విషాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. గుండెపోటుతో ఆయన కుమార్తె గాయత్రి గత శనివారం మృతి చెందింది. అయితే రాజేంద్ర ప్రసాద్ కుమార్తె గాయత్రి మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ఆమెకు నివాళులు అర్పించడంతో పాటు రాజేందప్రసాద్‌ను పరామర్శించిన విషయం తెలిసిందే. ఇప్పటికే మెగస్టార్ చిరంజీవితో పాటు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, వెంకటేశ్ తదితరులు ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. అయితే కూతురు పోయిన బాధలో ఉన్న నటకిరిటిని తాజాగా నటుడు రెబల్ స్టార్ ప్రభాస్ పరామర్శించాడు. ఆయనకు ధైర్యం చెప్పారు. అనంతరం రాజేందప్రసాద్ కూతురు గాయత్రికి నివాళులు అర్పించాడు. సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ కుమార్తె గాయత్రి గుండెపోటుతో మృతిచెందింది. 38 ఏండ్ల గాయత్రికి గత రాత్రి గుండెపోటు రాగా.. కుటుంబ సభ్యులు హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో చేర్చారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆమె చనిపోయారు. కాగా, రాజేంద్ర ప్రసాద్‌కు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అలానే గాయత్రి కుమార్తె సాయి తేజస్విని బాలనటిగా మహానటి చిత్రంలో నటించారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613